క్లుప్తంగా

ఉప ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ : స్వామిదాసు

తిరువూరు: కడప జిల్లాలో జరిగిన ఉప ఎన్నికల్లో అక్రమంగా గెలవాలనే దుర్బుద్ధితో తెలుగుదేశం పార్టీ ప్రజాస్వామ్య విలువలను మంటగలిపిందని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు విమర్శించారు. తిరువూరులో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రౌడీయిజం, గూండాయిజంతో ఎన్నికల్లో నెగ్గాలనే ఏకైక ధ్యేయంతో తెలుగుదేశం పార్టీ ఒంటిమిట్ట, పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో హింసాకాండకు తెరలేపిందన్నారు. వైఎస్సార్ సీపీ బూత్ ఏజెంట్లను దౌర్జన్యంగా బయటికి తరిమివేసి ఏకపక్షంగా ఎన్నికల్లో రిగ్గింగ్‌కు పాల్పడటం, దొంగ ఓట్లు వేయించడంపై ఎన్నికల సంఘం స్పందించాలని డిమాండ్ చేశారు. ఉప ఎన్నికల్లో అక్రమాలకు ఊతమిచ్చే విధంగా వ్యవహరించిన పోలీసుల వైఖరిపై కూడా కోర్టులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సర్టిఫికెట్ల ప్రదానం



మైలవరం: మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సర్టిఫికెట్ కోర్సు బుధవారం ముగిసింది. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ల రవి మాట్లాడుతూ వివిధ కళాశాలల్లో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థిని, విద్యార్థులు సర్టిఫికెట్ కోర్సును పూర్తిచేశారు. క్వాంటం కంప్యూటర్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రాధాన్యతలను ప్రిన్సిపాల్ వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ ఎస్. రంగారావు, కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ ఎస్. వెంకటాద్రి, కోర్సు కో–ఆర్డినేటర్ జీవీ రామకృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగిన ఉద్యోగుల ధర్నా



ఇబ్రహీంపట్నం: ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు బుధవారం ధర్నా కార్యక్రమం కొనసాగింది. డిపో అధ్యక్షుడు బీవీ ఆంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15న ప్రారంభించనున్న మహిళల ఉచిత బస్సు ప్రయాణానికి ఉద్యోగులు వివిధ రకాల సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. బస్సుల్లో మహిళల రద్దీ దృష్ట్యా కండక్టర్స్, డ్రైవర్స్‌కు క్రమశిక్షణ విషయాల్లో సడలింపు ఇవ్వాలన్నారు. యాజమాన్యం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ డిపో స్థలాలు ప్రైవేట్ సంస్థకు కట్టబెట్టే జీఓను వెనక్కు తీసుకోవాలన్నారు. జిల్లా నాయకులు వీఎస్ రెడ్డి ప్రచార కార్యదర్శి మోహన్, మహిళా ప్రతినిధి ఉషారాణి పాల్గొన్నారు.

పారదర్శకంగా చెత్త సేకరణ



చాట్రాయి: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుదలకు చెత్త సేకరణ కచ్చితంగా జరగాలని జెడ్పీ సీఈఓ ఎస్.శ్రీహరి అన్నారు. మండలంలోని కొత్తగూడెం పంచాయతీలో చెత్త సేకరణను బుధవారం పరిశీలించి ఆయన మాట్లాడారు. ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించి సంపద కేంద్రాలకు తరలించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి నాగరాజు, సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

140 మందికి నేత్ర వైద్య పరీక్షలు

నందిగామరూరల్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించేందుకే ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ తొండపు దశరథ జనార్దన్ అన్నారు. జయప్రద ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొండూరు గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. 140 మందికి వైద్య పరీక్షలు నిర్వహించగా 35 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని గుర్తించారు.

పంటచేలు మునక

- కుండపోత వర్షం అస్తవ్యస్తం
- జలమయమైన లోతట్టు ప్రాంతాలు
- మరో మూడు రోజులు వర్షాల హెచ్చరికలతో ఆందోళన



త్రిలోచనాపురంలో వరద నీటిలో మునిగిన వరి పైరు

ఇబ్రహీంపట్నం: కృష్ణానదికి పోటెత్తిన వరద ప్రవాహంతో పాటు ఆదివారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. వివిధ గ్రామాల్లో పంట పొలాలు నీటి ముంపునకు గురయ్యాయి. వరి పొలాలు పూర్తిగా నీటితో నిండి చెరువులను తలపిస్తున్నాయి. ఇప్పటికే ఒక్కొక్క రైతు ఎకరాకు రూ.15 వేల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. వాయవ్య మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడటం వలన మరో మూడు రోజులు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖాధికారులు ప్రకటించడంతో రైతులు ఆందోళనకు గురతున్నారు.

నీట మునిగిన కాలనీలు

కుండపోత వర్షంతో ఇబ్రహీంపట్నం కాజీమాన్యం, ప్రసాద్ నగర్ ఆంజనేయ కాలనీలను అర్ధరాత్రి వర్షం నీరు ముంచెత్తడంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. కొండపల్లిలోని ఆర్‌సీఎం న్యూ కాలనీతో పాటు పలు ప్రాంతాలు నీటి ముంపునకు గురయ్యాయి. జాకీర్‌హుస్సేన్ కళాశాల, జెడ్పీ పాఠశాలల ఆవరణలో వర్షం నీరు చేరింది. జూపూడి వద్ద జాతీయ రహదారిపై నీరు చేరడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. చిలుకూరు వద్ద ఏనుగుగడ్డ వాగు పొంగిపొర్లడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయి చిట్టిబాబు వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు.

నూజివీడులో కుండపోత వర్షం

నూజివీడు: బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా బుధవారం సాయంత్రం ఐదు గంటల నుంచి నూజివీడు ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. ఆకాశానికి చిల్లు పడిందా అన్నట్లుగా వర్షం ఆగకుండా పడుతూనే ఉంది. దీంతో మండలంలోని గ్రామాల్లో ఉన్న చెరువుల్లోకి వరదనీరు చేరుతోంది. భారీ వర్షంతో వరద నీరు పట్టణంలోని పల్లపు ప్రాంతాల్లోకి వచ్చి చేరుతోంది. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. సాయంత్రం నుంచి వర్షం ఆగకుండా పడుతూనే ఉండటంతో ప్రధాన రహదారుల్లో జనసంచారం లేక నిర్మానుష్యంగా మారాయి. విద్యార్థులు, ఉద్యోగులు వర్షంలోనే తడుస్తూ ఇళ్లకు చేరుకున్నారు. వర్షం ఇలాగే తెల్లవారులు కొనసాగితే సాగు చేసిన వరి, మొక్కజొన్న, అపరాలు, వేరుశనగ, కూరగాయలు తదితర పంటలు వరద ముంపునకు గురవుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

- **విస్సన్నపేట:** మండలంలో బుధవారం సాయంత్రం నుంచి ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తుండటంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. డ్రెయినేజీలు సక్రమంగా లేని చోట రహదారులపైనే వర్షం నీరు నిలిచింది. రాకపోకలకు ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు.

తిరువూరులో భారీ వర్షం

తిరువూరు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తిరువూరు, గంపలగూడెం, ఎ.కొండూరు మండలాల్లో బుధవారం మధ్యాహ్నం నుంచి వర్షం కురుస్తోంది. వర్షాధారంతో సాగుచేసే పంటలకు ఈ వర్షం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. ఎ.కొండూరు మండలం పాతకొండూరులో పక్కా డ్రెయినేజీలు లేక వర్షం నీరు పల్లపు ప్రాంతాల్లోని నివాస గృహాల్లోకి ప్రవేశిస్తోంది. ఎగువన ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పడమటివాగు, కట్టలేరు, అనురాధవాగు, వెదుళ్లవాగు, గుర్రపు వాగు, విప్పలవాగులకు వరద నీరు చేరుతోంది. ఎడతెరపి లేని వర్షం కారణంగా జనజీవనం స్తంభించింది.



ఇబ్రహీంపట్నం ఖాజీమాన్యం వీధిలో నిలిచిన వర్షం నీరు



ఇబ్రహీంపట్నం ఆంజనేయ కాలనీలోకి చేరిన వర్షం నీరు



నూజివీడులో కురుస్తున్న వర్షం

బుడమేరులో వరద ప్రవాహం సాధారణం



జి.కొండూరు: బుడమేరులో సాధారణ వరద ప్రవాహం బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభమైంది. మైలవరం నియోజకవర్గంతో పాటు తిరువూరు నియోజకవర్గంలో బుధవారం ఉదయం నుంచి చిరు జల్లులు మినహా భారీ వర్షం లేకపోవడంతో బుడమేరులో మూడు నుంచి ఐదు వందల క్యూసెక్కుల మధ్య వరద ప్రవాహం మాత్రమే కొనసాగుతోంది. ఈ వరద ప్రవాహం వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి బుడమేరు డైవర్షన్ కెనాల్ ద్వారా కృష్ణా నదిలో కలుస్తుంది. ఒకవేళ ఈ రాత్రి మొత్తం ఎగువ ప్రాంతాలలో భారీ వర్షం కురిస్తే గురువారం ఉదయానికి వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ వద్ద నీటి మట్టం పెరిగే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతానికి హెడ్ రెగ్యులేటర్ వద్ద డెడ్ స్టోరేజీ ఉన్నందున దిగువ ప్రాంతాల ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేదని అధికారులు చెబుతున్నారు.

రేపు మాంసం విక్రయాలు నిషేధం

విస్సన్నపేట: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న విస్సన్నపేట పంచాయతీ పరిధిలో మాంసం విక్రయాలు నిషేధించామని పంచాయతీ ఈఓ హరికృష్ణ కుమార్ బుధవారం తెలిపారు. ఆ రోజున మాంసం విక్రయాల దుకాణాలను పూర్తిగా మూసివేయాలన్నారు. ఎవరైనా మాంసం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఈఓ హెచ్చరించారు.

రసాయన ఎరువుల వినియోగం వద్దు

ముసునూరు: వరినాట్లు ముగిసి 10–15 రోజులు గడిచిన దృష్ట్యా రసాయనిక ఎరువులు వాడొద్దని మండల వ్యవసాయ శాఖాధికారి ఆలూరి చాముండేశ్వరి అన్నారు. గుడిపాడు, వలసపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. వరి నాట్లు ముగిసిన క్రమంలో ఇబ్బడి ముబ్బడిగా రసాయనిక ఎరువులు వినియోగించకుండా, వేపనూనె, వేప కషాయం వంటి వాటిని వాడాలన్నారు. సమగ్ర కలుపు యాజమాన్యంతో వరి పంట మెరుగ్గా పండుతాయని రైతులకు ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు గద్దె రఘు, కొల్లి గంగ సత్యనారాయణ, నెరుసు సత్యనారాయణ పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వాయిదా

విస్సన్నపేట: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అధ్యక్షతన బుధవారం వెలుగు కార్యాలయం మీటింగ్ హాల్‌లో సాధారణ సమావేశం ఏర్పాటు చేయగా సంబంధిత సభ్యులు హాజరు కాకపోవడంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేశామని ఇన్‌చార్జి ఎంపీడీఓ ప్రసాద్ తెలిపారు.

నేడు పాలకవర్గం ప్రమాణ స్వీకారం

మైలవరం: మైలవరం మండలం చంద్రగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం గురువారం జరుగుతుందని సొసైటీ కార్యాలయం గురువారం ఒక ప్రకటనలో పేర్కొంది. సొసైటీ చైర్మన్‌గా మోర్ల వెంకట రోశాలు, డైరెక్టర్లుగా ప్రత్తి తిరుపతిరావు, తోక నాగరాజు ప్రమాణ స్వీకారం చేస్తారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మైలవరం: ప్రభుత్వం, ప్రైవేట్ ఆస్పత్రులు కలిసి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. మైలవరంలోని మహదేవ్ హాస్పిటల్ నూతనంగా నిర్మించిన భవనాన్ని మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు మైలవరం వంటి మారుమూల ప్రాంతంలో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌ను అందుబాటులోకి తీసురావడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ హరిప్రసాద్‌ను అభినందించారు. త్వరలోనే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న వైద్య, ఆరోగ్య పోస్టులను భర్తీ చేస్తామని చెప్పారు. ఆరోగ్య శ్రీ సేవలు మరింతగా మెరుగుపర్చాలని, నాణ్యమైన వైద్యాన్ని ప్రజలకు అందించాలని కూటమి ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అత్యవసర చికిత్స కోసం విజయవాడ వెళ్లే అవసరం లేకుండా మైలవరం మండల పరిసర ప్రాంతాల ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందించేందుకు మహదేవ్ ఆస్పత్రి అందుబాటులో ఉంటుందన్నారు. పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎన్టీటీపీఎస్‌లో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేస్తాం

- ఉద్యోగులు, కార్మిక సంఘాల నేతల హెచ్చరిక
- ఎన్టీటీపీఎస్ వైద్యశాల ప్రైవేటీకరణపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు, నాయకులు

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్ వైద్యశాల ప్రైవేటీకరణ నిలుపుదల చేయకుంటే ప్లాంటు విద్యుదుత్పత్తిని నిలిపేస్తామని ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు హెచ్చరించాయి. వైద్యశాల వద్ద బుధవారం ఆందోళనకు దిగారు. వైద్యశాల ప్రైవేట్ సంస్థలకు అప్పగించవద్దని యాజమాన్యానికి హెచ్చరికలు జారీ చేశారు. ఉద్యోగులు, యూనియన్ నాయకులతో చర్చించకుండా ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో వైద్యశాలను పెట్టడం తీవ్రమైన చర్యగా అభివర్ణించారు. పూర్తి సదుపాయాలతో యాజమాన్యమే వైద్యశాల నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రైవేటీకరణ ఆపకుంటే ప్లాంట్‌ను షట్‌డౌన్ చేస్తామన్నారు. వైద్యశాల వద్దకు వెళ్లకుండా ఎస్పీఎఫ్ సిబ్బంది ఉద్యోగులను అడ్డుకున్నారు. పలువురు ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా



జింకలపాలెంలో ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నాయకులు

తిరువూరు: జాతీయ సమైక్యతను చాటిచెబుతూ గంపలగూడెం మండలం పెనుగొలను శివారు జింకలపాలెంలో బుధవారం విద్యార్థులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటిపై జాతీయ పతాకం ఎగురవేయాలని కోరుతూ షిర్డీ సాయిబాబా సేవా కమిటీ కన్వీనర్ ఊటుకూరు నారాయణరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు లక్ష్మణ, షెహనాజ్ బేగం, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **నూజివీడు:** బీజేపీ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం నూజివీడు ప్రధాన వీధుల్లో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మువ్వన్నెల జెండాలతో నాయకులు, విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. బీజేపీ పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కుంపటి అరుణ, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు బోను అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



కేతనకొండలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, నాయకులు

- **కేతనకొండ(ఇబ్రహీంపట్నం):** బీజేపీ మండల అధ్యక్షురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ కేతనకొండ గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి జాతీయ జెండాలు చేతబట్టి గ్రామంలో ప్రదర్శన చేశారు. మహిళా మోర్చా అధ్యక్షురాలు మొక్కపాటి జయలక్ష్మి, పయ్యావులు రాము, విద్యార్థులు,సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పంటల బీమాకు దరఖాస్తు చేసుకోండి

ముష్టికుంట్ల(తిరువూరురూరల్): ఖరీఫ్ సీజన్‌లో పత్తి సాగు చేసే రైతులు పంటల బీమా పథకానికి ఈ నెల 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తిరువూరు మండల వ్యవసాయాధికారి పద్మ అన్నారు. తిరువూరు మండలం ముష్టికుంట్ల, చింతలపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. వరి సాగు చేసే రైతులు ఈ నెల 31లోగా పంటల బీమా పథకానికి మీసేవా కేంద్రాల్లో లేదా పంట రుణాలు పొందే బ్యాంకులు, సహకార సంఘాల్లో నమోదు చేసుకోవాలని సూచించారు. ముష్టికుంట్ల, చింతలపాడు సర్పంచులు కోటేశ్వరరావు, దానయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ అనిల్ పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మున్సిపల్ కార్మికుల సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని సీఐటీయూ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.జ్యోతిబసు అన్నారు. కొండపల్లిలో బుధవారం జరిగిన యూనియన్ ద్వితీయ మహాసభలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు పెంచిన వేతనాలు అమలు చేయాలన్నారు. కార్మికులకు రక్షణ పరికరాలు అందజేయాలని సూచించారు. అనంతరం యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా ఎం.మహేష్, అధ్యక్షుడిగా సురేష్, ప్రధాన కార్యదర్శిగా కృష్ణ, కోశాధికారిగా నవీన్, మరో 12 మంది సభ్యులను ఎన్నుకున్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో ప్రతిభ



ఆగిరిపల్లి: రాష్ట్ర స్థాయి సీబీఎస్‌ఈ అండర్–19 బ్యాడ్మింటన్ పోటీల్లో చొప్పరమెట్ల కేకేఆర్ గౌతమ్ హ్యాపీ వ్యాలీ పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానంలో నిలిచి కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను పాఠశాల డీజీఎం రాధాకృష్ణ, జీఎం వీవీఎస్ ప్రసాద్, డైరెక్టర్ ఆనంద్‌కుమార్, ప్రిన్సిపాల్ మంజునాథ్ అభినందించారు.


ఆర్ అండ్ బీ సీఈపై ఎమ్మెల్యే వసంత ఆగ్రహం

మైలవరం: మైలవరం ఆర్ అండ్ బీ సీఈ శ్రీనివాసరెడ్డిపై మైలవరం ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. మైలవరం మండలం తోలుకోడు సొసైటీ త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే వద్ద వెల్వడం రోడ్డు ప్రస్తావన రావడంతో స్పందించిన ఆయన మాట్లాడుతూ ఆర్ అండ్ బీ సీఈ శ్రీనివాసరెడ్డి ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వాన్ని బదనాం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని, అందువలనే ప్రభుత్వం నుంచి వెల్వడం రోడ్డుకు మూడుసార్లు అనుమతి వచ్చినా దానిని తిరస్కరించాడని ఆరోపించారు. రెండు రోజుల్లో పేపర్ వర్క్ పూర్తి చేసి టెండర్లు పిలవాలని అల్టిమేటమ్ జారీ చేశామన్నారు. రెండు రోజుల్లోగా టెండర్లు పిలవకపోతే 100 కార్లు వేసుకుని ఆర్ అండ్ బీ సీఈ కార్యాలయం ముందు ఆయన ఇంటి ముందు టెంట్‌లు వేసి నిరాహార దీక్ష, ధర్నా చేస్తామన్నారు.

యూరియా కోసం రైతన్నల పాట్లు

చాట్రాయి: ఖరీఫ్ సీజన్‌లో యూరియా కొరత రైతులను వెంటాడుతోంది. వరి నాట్లు పూర్తి కావడంతో ప్రస్తుతం వరి సాగుకు యూరియా చాలా డిమాండ్ ఏర్పడింది. అయితే యూరియా సరిపడినంత లేకపోవడంతో రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద పడిగాపులు పడుతున్నారు. బయట మార్కెట్లో ఎక్కువ ధరలకు విక్రయిస్తుండటంతో యూరియా కోసం రైతులు ఆర్‌ఎస్‌కేల వద్ద బారులు తీరుతున్నారు. బుధవారం మండలంలోని బూరుగుగూడెం సొసైటీ వద్ద యూరియా కోసం రైతులు భారీగా తరలి వచ్చారు.

మునేరుకు భారీగా వరద



పెనుగంచిప్రోలు: ఎగువ ప్రాంతాలైన ఖమ్మం, వరంగల్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలకు మునేరుకు బుధవారం వరద నీరు భారీగా చేరింది. దీంతో శ్రీతిరుపతమ్మవారి ఆలయం వద్ద మునేరులోకి ఎవరూ వెళ్లకుండా అధికారులు గేట్లు మూయించారు. ఆలయానికి చెందిన మునేరులోని తాగునీటి పైపులైన్ వరద నీటికి కొట్టుకు పోవటంతో బావి, బోరు ద్వారా ట్యాంకర్‌కు నీరు ఎక్కించి భక్తులకు ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు చేపట్టారు. మునేరు వరద నీరు ఇంకా పెరిగితే ఇప్పటికీ తువ్వ కాలువ గండ్లు పూడ్చకపోవటంతో వరద నీరు పొలాలను గత ఏడాది లాగా మళ్లీ ముంచెత్తుతాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే పొలాల గుండా నీరు కొద్దిగా ప్రవహిస్తూనే ఉంది. మరో మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని చెబుతున్న నేపథ్యంలో రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు.

త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం

మైలవరం: రైతుల శ్రేయస్సే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. మైలవరం మండలం తోలుకోడు గ్రామ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం బుధవారం జరిగింది. సొసైటీ చైర్మన్‌గా కోటగిరి వెంకటేశ్వరరావు, సభ్యులుగా పామర్తి దశరథ, గొట్టి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.